క్లుప్తంగా

బ్రహ్మదాసు నాయన ఆరాధనోత్సవాలు

శావల్యాపురం: వేల్పూరులోని వీరబ్రహ్మేంద్ర విజ్ఞాన సేవా ఆశ్రమంలో వ్యవస్థాపకులు బ్రహ్మదాసు నాయన ద్వితీయ ఆరాధనోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది యలవర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా భైరవకోనలోని ఓంకార అచల గురుపీఠం అధిపతి గురుబ్రహ్మ యోగేశ్వరులు హాజరయ్యారు. బ్రహ్మదాసు నాయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆశ్రమ వేదపాఠశాల ఉపాధ్యాయులు పూసపాటి నాగేశ్వరరావు రచించిన పూసపాటి వీరరాఘవ వాస్తు గణిత పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రధాన అర్చకులు కడియాల ఆంజనేయశాస్త్రి, దేసు మల్లికార్జునరావు, ప్రదీప్, గ్రామస్తులు వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భజే ప్రసన్నాంజనేయం

రేపు పొట్లూరులో స్వామి తిరునాళ్ల



శావల్యాపురం: పొట్లూరు గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఈనెల 15న తిరునాళ్ల నిర్వహించనున్నట్టు ఆలయ పూజారి మారుతీశర్మ తెలిపారు. ఇక్కడ కొన్నేళ్లుగా తిరునాళ్ల జరగడం ఆనవాయితీగా వస్తోంది. తిరునాళ్లకు వచ్చే విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రభలకు అనుమతులు పొందాలని ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంపుదల చేసే బాధ్యత ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రోజూ 3 వేల మంది కూలీలు పనులు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 1,500 మంది పంట కాల్వల పనులు చేస్తున్నట్లు చెప్పారు. బొందిలిపాలెం, గుంటుపాలెం, వేల్పూరు మినహా అన్నీ పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పించాలన్నారు. అధికారుల సూచనల మేరకు పనులు చేసిన కూలీలకు రోజువారి వేతనం రూ.272 ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తోందన్నారు. ఎంపీడీఓతోపాటు ఏపీవో రాజు, ఉపాధి అధికారులు శ్రీనివాసగుప్తా, సుధాకర్ ఉన్నారు.

సమాజంపై అవగాహన అవసరం

శావల్యాపురం: సమాజంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల ప్రాధాన్యం, సేవల గురించి ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని శావల్యాపురం పోస్టల్ అధికారి డి.శివకోటి చెప్పారు. గురువారం స్థానిక శ్రీరామ పబ్లిక్ స్కూల్లో కమ్యూనిటీ హెల్పర్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. పోస్టల్ అధికారి శివకోటి మాట్లాడుతూ సమాజం- సమకాలీన పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, డైరెక్టరు అజిత్‌చంద్, ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి, ఉపాధ్యాయులు మనీషా, మస్తాన్‌బీ, హైమా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాల తరలింపునకు వాహనం సమకూర్చండి

నరసరావుపేట: పట్టణంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు మరణిస్తే సమాధుల తోటకు మృతదేహాలను తీసుకు పోయేందుకు ప్రభుత్వపరంగా పురపాలకసంఘం వాహనం సమకూర్చాలని గోపిరెడ్డి యువసేన అధ్యక్షుడు, పట్టణ మేరీకర్జ్ చర్చి పాలకవర్గ అధ్యక్షుడు పంగులూరి విజయకుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

లాడ్జిలో ప్రకాశం వాసి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని నరసరావుపేట సెంటర్లో ఉన్న ఏటీ లాడ్జిలో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడు ప్రకాశం జిల్లాకు చెందిన వాసుబాబుగా పోలీసులు గుర్తించారు. కొద్దికాలంగా చిలకలూరిపేట పట్టణంలోని రెడ్ల బజారులో నివాసం ఉంటూ యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని ఓ నూలుమిల్లులో పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో వాసుబాబు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

వెల్దుర్తి: మండలంలో కొత్తపుల్లారెడ్డిగూడెంలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గన్నెబోయి లింగయ్య ఈ నెల 11వ తేదీ మంగళవారం తెల్లవారుజామున కొత్తపుల్లారెడ్డి గూడెం నుంచి గుంటూరుకు వెళ్లే బస్సులో ఎక్కి యర్రబాలెం గ్రామంలో దిగినట్లు తెలిసింది. లింగయ్య వడ్డీ వ్యాపారం చేస్తారని తెలిసింది. ఉదయం 10గంటల నుంచి ఫోన్‌లో కూడా అందుబాటులో రాకపోవటంతో బంధువుల వద్దకు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే బుధవారం కూడా ఇంటికి రాకపోవటంతో భార్య గురవమ్మ వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పిల్లల భవితవ్యమే జగనన్న లక్ష్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- మన బడి, నాడు–నేడు పనులకు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి విడదల రజిని

యడ్లపాడు: విద్యతోనే ప్రగతి సాధ్యమని, ప్రతి విద్యార్థికీ విద్య అనే ఆస్తిని అందించాలని కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీలోని సంగం గోపాలపురంలోని ఎస్టీ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులకు గురువారం మంత్రి భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన బడి, నాడు–నేడుతో రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని పేర్కొన్నారు. మన బడి, నాడు–నేడు రెండో దశ కార్యక్రమంలో భాగంగా గోపాలపురం ఎంపీపీ పాఠశాలకు రూ.39,70,697 మంజూరు చేయించామని చెప్పారు. ఈ నిధులతో మూడు తరగతి గదులు, మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, బసెల శివరామకృష్ణ, రాచమంటి చింతారావు, సర్పంచ్ మల్లవరపు పోలవతి, ఎంపీటీసీ సభ్యులు వావిళ్ల పోలేరు, పీఎం చైర్మన్ మాదాసు నాగలక్ష్మి, హెచ్ఎం సమత, నాయకులు పోట్లూరి సైదులు, కాళహస్తి రాంబాబు, కొమరగిరి రఘు, మల్లె సుబ్బారావు, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, షేక్ షంషున్‌జుహా, కె మాధవరావు, చాతరాజుపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, టీఏ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రజిని పాల్గొన్నారు.

సంక్షేమ పాలనపై ప్రజల సంతృప్తి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వాడవాడలా ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్
- ఇంటింటా ప్రజల జేజేలు



వినుకొండ 18 వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నరసరావుపేట ఒకటో వార్డులో..



నరసరావుపేట 24వ వార్డులో..



నరసరావుపేట 31వ వార్డులో..


వినుకొండ(నూజెండ్ల)/నరసరావుపేట/రొంపిచర్ల/యడ్లపాడు: జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. గడప గడపలో ప్రజలు వైఎస్సార్ సీపీ నాయకులకు ఘన స్వాగతం పలుకుతున్నారు. సంక్షేమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ పట్టణంలోని 18వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను లబ్ధిదారుల గృహాలకు అతికించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత టీడీపీ పాలన అంతా దుర్మార్గమని ధ్వజమెత్తారు. వినుకొండ అభివృద్ధిపైనా, వేసవిలోనూ సురక్షిత నీరు సరఫరాపైనా ప్రజలు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు పి.ఎస్.ఖాన్, వినుకొండ రూరల్ కన్వీనర్ దండుచెన్నయ్య, కౌన్సిలర్లు కాంట్రాక్ట్ గౌస్ బాషా, షకీల దస్తగిరి, గంటా కాలేషా, పాపసాని బ్రహ్మయ్య, చాపలమడుగు షైదా, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు నరసరావుపేట పట్టణ, మండల పరిధిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. ప్రజల అనుమతితో వారి ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు.

■ వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో రొంపిచర్ల మండలం సంతగుడిపాడు, తుంగపాడు గ్రామాల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ అధ్యక్షుడు గాదె రామిరెడ్డి, ఏనుగంటి వెంకటరత్నం, చింతగుంట అంజిరెడ్డి, బత్తుల రామకృష్ణ, కాటా రామిరెడ్డి, తిరపాటి అంజనారెడ్డి, పల్లకి శ్రీనివాసరెడ్డి, కాటా రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

■ యడ్లపాడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఎంపీపీ పిడతల ఝాన్సీ గురువారం ప్రారంభించారు. గృహసారథుల మండల కన్వీనర్ రాచమంటి చింతారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిడతల దయాసాగర్, మాదం శ్రీనివాసరావు, కర్నాటి సుబ్బారావుతో కలిసి కొత్తూరులోని సాయిబాబా గుడి వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు బండ్ల రామారావు, మారెళ్ల వెంకటేశ్వర్లు, షాజహాన్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



దగ్ధమైన గృహోపకరణాలు

నరసరావుపేట టౌన్: అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించి గృహోపకరణాలు దగ్ధం కావడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. సకాలంలో అధికారులు స్పందించటంతో ప్రాణనష్టం తప్పింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రామిరెడ్డిపేట లక్కీహోమ్ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ఏసీ నుంచి మంటలు చెలరేగాయి. గృహోపకరణాలు, విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఫ్లాట్‌లో ఉన్న ముగ్గురు బయటకు రాలేకపోయారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఫ్లాట్‌లో ఉన్న రాజనాల లలితప్రసాద్, రాజరాజేశ్వరి, సంజన గాయపడ్డారు. వీరిని సీఐ, అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. క్షతగాత్రులను 108 సహాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు.

సౌమిత్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డీపీఓ విజయభాస్కరరెడ్డి

రొంపిచర్ల: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సౌమిత్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీవో విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సౌమిత్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. స్థలాల రీసర్వే చేపట్టి అర్హులకు హక్కు పత్రాలు అందించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఈపూరు, రొంపిచర్ల మండలాల ఎంపీడీవోలు మాధ్యూబాబు, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీ కుల గణనను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా కృతజ్ఞతగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీసీల ఐక్యత వర్ధిల్లాలి, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, మండల అధ్యక్షుడు గాలి సాంబశివరావు, నాయకులు ముక్కడాల వెంకటేశ్వరరావు, చక్రవరం సత్యనారాయణరాజు, ముక్కడాల శ్రీనివాసరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, పిడెం హుసేన్, అంజిబాబుపాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు



హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ మృతదేహానికి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

నరసరావుపేట: స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాళ్లూరి సూర్యనారాయణ భౌతిక కాయాన్ని గురువారం డీఎస్పీ సి.విజయభాస్కరరావు, రూరల్ పోలీసు అధికారులు సందర్శించి నివాళులర్పించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాలతో సూర్యనారాయణ స్వగ్రామం ఫిరంగిపురం మండలం మేరికపూడికి వచ్చిన డీఎస్పీ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25వేలు అందజేశారు. అనంతరం పోలీసు లాంఛనాలతో సూర్యనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ భక్తవత్సలరెడ్డి, రూరల్ ఎస్సైలు బాల నాగిరెడ్డి, పి.హాజరత్తయ్య, నల్లపాడు ఎస్సై రోశయ్య, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు వామపక్షాలు ఐక్యం కావాలి



సభలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు లక్ష్మి

యడ్లపాడు: ప్రజాస్వామ్య రక్షణ కోసం వామపక్షాలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. జాతీయ అమరవీరుల దినోత్సవం సందర్భంగా తుమ్మలపాలెం అమర్‌నగర్‌లో ప్రజా పోరాటాల్లో అసువులు బాసిన 28 మంది అమరవీరుల స్థూపాలపై సీపీఐ, సీపీఎం, సీపీఎం(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పూలుజల్లి నివాళి అర్పించారు. అనంతరం వామపక్షాల జెండాలను ఆవిష్కరించారు. తర్వాత జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ వాపక్షాలు ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, సీపీఐ పల్నాడు జిల్లా కమిటీ కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్, సీపీఎం(ఎంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ తనిఖీలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సివిల్ సప్లయ్స్ గోడౌన్‌ను తహసీల్దార్ కిరణ్‌కుమార్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా అయ్యే బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార నిల్వలను పరిశీలించారు. తూకం, నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీని సాగనంపుదాం



ప్రచార భేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్షాల నేతలు

నరసరావుపేట ఈస్ట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామనే నినాదంతో గురువారం నుంచి 30వ తేదీ వరకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రచార భేరీ నిర్వహిస్తున్నట్టు వామపక్ష నాయకులు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం మోదీని గద్దె దింపండి– దేశాన్ని కాపాడండి పేరుతో ప్రచార భేరీ పోస్టర్‌ను విడుదల చేశారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎ.మారుతి వరప్రసాదు, గుంటూరు విజయకుమార్ ప్రచారభేరీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కాసా రాంబాబు, డి.శివకుమారి, వైదన వెంకట్, నాగేశ్వరరావు, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

షాలెం నగర్‌లో కార్డన్ సెర్చ్

నరసరావుపేట టౌన్: పట్టణంలోని షాలెంనగర్‌లో బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆకస్మిక తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

గొరిజవోలు వక్ఫ్ భూములకు కౌలు వేలం

నాదెండ్ల: గొరిజవోలు గ్రామ రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదుకు చెందిన వక్ఫ్ భూములకు ఈ నెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కరిముల్లాబాషా తెలిపారు. ఆసక్తిగలవారు పాల్గొనాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకు రెండు కళ్లు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- మురికిపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కరపత్రాలను అందజేస్తున్న మంత్రి రజిని

చిలకలూరిపేటటౌన్: సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో గురువారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి రజినికి తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆడపడుచులా ఆదరించారు. ముందుగా మంత్రి రజిని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధిని వివరించారు. కరపత్రాలను పంచారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే జగనన్న లక్ష్యం..

అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి విడదల రజిని చెప్పారు. నవరత్న సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే తెచ్చేలా వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టినట్టు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపీపీ సూరబోయిన ఆదిలక్ష్మి, సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు జమ్ములమడక సూర్యప్రకాష్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ ఆరుమళ్ల వెంకటశివ, వైఎస్సార్ సీపీ నాయకులు గోసు ముక్కంటి, గోడి సాంబయ్య, కొమ్మనబోయిన చెంచురాములు, పెడవల్లి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో స్వయంగా వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గురువారం రాత్రి ముస్లింలకు భారీ స్థాయిలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. పట్టణంలోని పెద్ద మసీదు సెంటరు, రణాహుస్సేన్ పంజా, షాదీఖానా, మర్కస్ మసీదు సెంటర్లలో ఈ కార్యక్రమాలు జరిగాయి. 10 వేల మందికిపైగా ముస్లింలు విందులో పాల్గొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ముస్లింలకు వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వినుకొండలో మైనారిటీ కళాశాల, షాదీఖానా, నూతన మసీదు నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు పి.ఎస్.ఖాన్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కౌన్సిలర్లు, గంటాకాలేషా, ఎమ్.ఎస్.కె.బాషా, చాపలమడుగు షైదా, కాంట్రాక్ట్ గౌస్ బాషా పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ రాజశేఖర్

యడ్లపాడు: రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్య కార్యమని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. గురువారం రాత్రి యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో షేక్ రషీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. స్వయంగా వడ్డించారు. అనతంరం ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను ఎంపీటీసీ తోకల వీరరాఘవయ్య, సర్పంచ్ షేక్ కరిమూన్ తదితరులు సత్కరించారు.

భూసార పరీక్షలు తరచూ చేయించాలి



మట్టిని సేకరించే పద్ధతిని సిబ్బందికి తెలియజేస్తున్న వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ శివకుమారి

నరసరావుపేట రూరల్/ఈపూరు/నాదెండ్ల: భూసార పరీక్షల ద్వారా మొక్కలకు అవసరమైన పోషకాలను అందించి అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ పి.శివకుమారి తెలిపారు. అల్లూరివారిపాలెం గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలో గురువారం మట్టి నమూనా సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన శివకుమారి మాట్లాడుతూ భూమి సారాన్ని పరీక్షించడం ద్వారా నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్షల ద్వారా భూమిలో ఏ పంట సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చో తెలుస్తుందన్నారు. అందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

■ ఈపూరు మండలం కొండ్రముట్ల రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి రామినేని రామారావు ఆధ్వర్యంలో భూసార పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని పొలాల్లో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు పురేటి అశోకా, బి.అప్పారావు, రెండు మండలాల రైతు భరోసా వీఏఎలు రైతులు పాల్గొన్నారు.

■ నాదెండ్లలోని రైతు భరోసా కేంద్రంలోనూ వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.